క్లుప్తంగా

మాజీ మంత్రులపై చర్యలు తీసుకోవాలి

గద్వాల క్రైం: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై చర్యలు తీసుకోవాలని గద్వాల కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, రఫీ, రవిలు మంగళవారం ఎస్పీ రితిరాజ్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో నాయకుల ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు మాజీ డీసీపీ రాధాకిషన్ రావు వెల్లడించడం జరిగిందన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌లో గద్వాలకు చెందిన సరితతిరుపతయ్య ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారన్నారు. ఈ వ్యవహారంపై సదరు మాజీ మంత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ



మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామ పంచాయతీ రికార్డులను, ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీకి సంబంధించిన కూలీలు రూ.300 కూలీ పడేలా కొలతలను నిర్వహించాలని సూచించారు. ఉదయం 7గంటల సమయానికి ఉపాధి పనికి వెళ్లాలని, క్షేత్రస్థాయిలో నిర్దేశించిన పనిని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల తీరు సరికాదు

గద్వాల అర్బన్: గద్వాల మండలంలోని అనంతపురంలో బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య, ఆరోగ్యం తదితర విషయాలపై అవగాహన కల్పించేందుకు వచ్చిన చైతన్య మహిళా సంఘం సభ్యులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ రాధ, శ్రీదేవిలు ఒక ప్రకటనలో మంగళవారం తీవ్రంగా ఖండించారు. మహిళ హక్కుల కోసం, మహిళల సమస్యలపై పని చేస్తున్న చైతన్య మహిళా సంఘంపై పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని పేర్కొన్నారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అన్నదానానికి రూ.2.50లక్షల విరాళం



గద్వాలన్యూటౌన్: నడిగడ్డలో ప్రఖ్యాతి గాంచిన జములమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతి పౌర్ణమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి మంగళవారం కర్ణాటక రాష్ట్రం ఇల్కల్ గ్రామానికి చెందిన రామచంద్ర కాట్వా కుటుంబ సభ్యులు రూ.2.50లక్షల విరాళాన్ని అందజేశారు. మొత్తం నగదును ఆలయ ఈఓ పురేందర్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఇల్కల్ గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

శాంతినగర్: పొలం పనులకు వెళ్లి వస్తూ మార్గమధ్యలో మోటార్ సైకిల్ అదుపుతప్పి ఓ రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. తనగల గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి రోజులాగే వ్యవసాయ పొలానికి వెళ్లాడు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి కిందపడింది. దీంతో మహేశ్వర్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



శాంతినగర్ వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆయా వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డ్రెయినేజీలు శుభ్రపరచడం, చెత్తా చెదారం తొలగించే పనులను సిబ్బంది చేపడుతున్నారు. జేసీబీతో ఆయా కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు.

విత్తేకాలం.. రైతులు జాగ్రత్త

- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి
- అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి
- నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు
- మండలాల్లో అధికారుల సూచనలు తప్పనిసరి



ఉండవెల్లిలో సాగు చేసిన పత్తి పంట(ఫైల్)

ఉండవెల్లి: వానాకాలం పంటల సాగుకు రైతులు సర్వం సిద్ధం చేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తారు. ఈసారి అధికంగా పత్తికే మొగ్గు చూపుతున్నారు. అలంపూర్ నియోజకవర్గ ఏడీఏ పరిధిలో అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, రాజోళి, అయిజ, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాలు ఉండగా, వీటి పరిధిలో దాదాపు లక్ష 20 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వర్షాలు కురవగానే రైతులు విత్తుకునేందుకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. పత్తి రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయి అధికారులతో రైతులకు సూచనలు, సలహాలు తెలిపారు.

నకిలీ విత్తనాల బెడద..

రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకొని సాగు చేయకుంటే దిగుబడి రాక పెట్టుబడులు నష్టపోవాల్సి వస్తుంది. వ్యవసాయ, పోలీసుశాఖల అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తూ నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. విత్తన విక్రయ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. ఆయా డీలర్ల వారీగా స్టాక్ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా డిమాండ్ పేరిట అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా తమకు ఫిర్యాదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.



విత్తనాల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గతేడాది నష్టాల్లో పత్తి సాగు..

పత్తి సాగు చేసే రైతులు డిమాండ్ ఉన్న రకాలకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. గతంలో అధిక వర్షాలతో డిమాండ్ ఉన్న రకాల విత్తనాలకు కొరత ఉంది. రైతులు ఒకేరకం కాకుండా పలు రకాల విత్తనాలు విత్తుకోవడం వల్ల నష్టపోకుండా ఉండవచ్చు. బోల్‌గార్డు-2 విత్తన ప్యాకెట్ ధర రూ.864 మాత్రమే ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి. ఇతర జిల్లా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి గ్రామాల్లో కొందరు బీటీ-3 విత్తనాల పేరిట లూజ్ విత్తనాలు, నకిలీ విత్తనాలు, విక్రయించే అవకాశముంది. లూజ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దు. విత్తన ప్యాకెట్‌పై తయారీ తేదీ, గడువు తేదీ, జీఈఏసీ(జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజర్ కమిటీ) నంబర్ తప్పనిసరిగా చూసుకోవాలి. లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయ్యాలి. కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్‌పై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్, ల్యాబ్ నంబర్, ధర, ఉండాలి. విత్తుకున్న తరువాత పంట దిగుబడి వచ్చేవరకు బిల్లుతో పాటు ఖాళీ ప్యాకెట్లను రైతులు తమ వద్ద భద్రపరుచుకోవాలి.

రైతులు నాణ్యమైన విత్తనాలు సాగు చేయాలి..



ప్రతి రైతు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయాలి. లూజ్ విత్తనాలు, నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతారు. పత్తిలో 62 రకాల విత్తనాలుంటాయి. ప్రభుత్వంతో గుర్తించబడిన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయాలి.

– సక్రియనాయక్, ఏడీఏ అలంపూర్ డివిజన్

కరాటేలో రాణించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



కరాటే విన్యాసాలను తిలకిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: విద్యతో పాటు కరాటేలో రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. డ్రాగన్ షోటోకాన్ కరాటే విద్యార్థులకు జిల్లా కేంద్రంలో అప్‌గ్రేడ్ బెల్ట్ టెస్టును నిర్వహించారు. ఈ టెస్టులో జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ్, వరుణ్, నరేష్, మిథిలేష్‌లు బ్లాక్ బెల్ట్‌ను సాధించారు. వీరిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. విద్యతో పాటు కరాటేలో రాణించి తల్లిదండ్రులకు, గురువులు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన కరాటే విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్ అర్బన్ ప్రెసిడెంట్ అర్బాత్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్, తుమ్మల నర్సింహులు, ఆనంద్ గౌడ్, రామకృష్ణ ఉన్నారు.

జెడ్పీ చైర్ పర్సన్ పరామర్శ..

గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహులు తల్లి, మాజీ సర్పంచు బుజ్జమ్మ (70) మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు నాయకులు ఉన్నారు.

పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే విజయుడు



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మంగళవారం బాధితులకు అందజేశారు. వడ్డేపల్లి మండలం శాంతిగర్‌కు చెందిన జోసెఫ్ రాజ్ వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా రూ.4 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఎర్రవల్లి మండలం కొండేరు ఎంపీటీసీ ఈరమ్మ భర్త వీరన్న కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. గద్వాలకు చెందిన రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి కల్యాణ్ కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. వీరితో పాటు జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, ఆలయ ధర్మకర్త వెంకటేష్, రాజేష్, రాజేంద్రప్రసాద్, రఘురెడ్డి ఉన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు



ఎస్ఐ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న అర్చకులు

గద్వాలన్యూటౌన్: భక్తుల కొంగుబంగారుగా విరాజిల్లుతున్న జములమ్మ అమ్మవారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. నడిగడ్డ ప్రాంతంతో పాటు కర్నూల్, రాయచూర్ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కోళ్లు, మేకపోతులు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జములమ్మ అమ్మవారిని పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని శాలువాతో సత్కరించి, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన

మానవపాడు: వర్షాకాలం విత్తన కొనుగోలుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మంగళవారం తిమ్మాపురం వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. లూజుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని, కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

సురవరం ప్రతాపరెడ్డికి ఘన నివాళి



ఇటిక్యాలపాడులో సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులో సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి మాజీ సర్పంచ్ సురవరం లోకేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కలంతో ఉద్యమాన్ని నడిపించి ఉమ్మడి జిల్లాలోని వనపర్తి అసెంబ్లీ స్థానంలో ఎమ్మెల్యేగా గెలవడంతో తెలంగాణ కవులలో ప్రఖ్యాత గాంచిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ప్రమిలమ్మ, శ్రీధర్‌రెడ్డి, నరసింహ, పరుష, బీచుపల్లి, రాముడు, సుధాకర్ పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: తెలంగాణ సమాజాన్ని జాగృత పర్చిన మహావ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి అని ఎంఏఎల్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. సురవరం ప్రతాప రెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పత్రిక సంపాదకుడు, పరిశోధకుడు, పండితుడు, రచయిత, ఉద్యమకారుడిగా బహుముఖ ప్రతిభ వంతుడిగా తెలంగాణ సమాజాన్ని ప్రతాపరెడ్డి జాగృతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, నాగభూషణం, శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి



శాంతినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అయిజ: మాజీ సీఎం దివంగత నందమూరి తారక రామారావు 101వ జయంతిని మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఎన్‌టీఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, సవారన్న, శేఖర్, భీమన్న, వెంకటేష్, అంజి, రాము, తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: మాజీ సీఎం నందమూరి తారక రామారావు జయంతిని వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, కిష్టన్న, యోహాన్, చాణక్య, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు సుంకులమ్మ ఆలయంలో దుండగులు చోరీ చేసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బొంకూరు సుంకులమ్మ ఆలయంలో సోమవారం రాత్రి ఆలయం తాలాలు పగులగొట్టి హుండీలో రూ.5వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆలయ పూజారి మహేశ్వరమ్మ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

దొంగ ఆచూకీ ఎక్కడా?

- పెట్రోలింగ్ వాహనం చోరీకి యత్నం..

మానవపాడు: పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఆదివారం సాయంత్రం చోరీకి గురై సోమవారం మధ్యాహ్నం పెట్రోల్ పంపులో ప్రత్యక్షమైన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో చోరీ చేసిన వ్యక్తి ఆచూకీ గుర్తించడంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తోంది. జాతీయ రహదారి 44పై కోదండాపురం స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలింగ్ వాహనాన్ని చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి కోదండాపురం పెట్రోల్‌బంక్‌లో పెట్రోలింగ్ వాహనాన్ని వదిలి పరారయ్యారు. ఇప్పటి వరకు చోరీ చేసిన వ్యక్తి ఆచూకీ గుర్తించలేదు. శాంతిభద్రతల కల్పించే పోలీసులు అజాగ్రత్త ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఎంటని, వెంటనే దొంగను పట్టుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ వెంకటేష్‌ను వివరణ కోరగా, దొంగ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

అధికారుల సూచనలు పాటించాలి



కేటీదొడ్డి: రైతులు విత్తనాల ఎంపికలో అధికారుల సూచనలను తప్పక పాటించాలని ఏఈఓ ప్రియాంక అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపురం, రంగాపురం గ్రామాల్లో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాల ఎంపిక, రకాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, పంట మార్పిడి, వాడాల్సిన ఎరువులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

అయిజ: బీఆర్ఎస్ నేత ఉత్తనూరు తిరుమలరెడ్డి 60 జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు సంకపురం రాముడు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు హాజరై తిరుమలరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు 126 మంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ తరుపున ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ తాహెర్, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



‘పట్టాలిచ్చారు.. స్థలాలు చూపండి’



అలంపూర్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అలంపూర్: వరద బాధితులకు పట్టాలిచ్చారని, వాటి స్థలాలు చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నరసింహ కోరారు. 2009 వరద బాధితులకు ఇళ్ల స్థలాలు చూపాలని తహసీల్దార్ మంజులకు మంగళవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో కృష్ణా, తుంగభద్ర నదులకు వచ్చిన వరదల వల్ల అలంపూర్ మున్సిపాలిటీ ముంపునకు గురైందన్నారు. వరద బాధితులకు పునరావాసం కోసం 2013లో 43 ఎకరాల భూమిని సేకరించి ప్లాట్లుగా మార్చి పట్టాల పంపిణీ చేసినట్లు తెలిపారు. పట్టాలిచ్చిన వరద బాధితులకు ఇప్పటికీ స్థలాలు చూపలేదన్నారు. వరద బాధితులకు ప్లాట్ల స్థలాలు చూపాలని పోరాటం చేసినా ఫలితం లేదన్నారు. వరద బాధితులకు కొత్త పట్టాలిస్తామంటే పాత పట్టాల తీసుకొని రశీదులు ఇచ్చారన్నారు. రశీదులు ఇచ్చి ఏడాది గడిచినా ఇప్పటి వరకు కొత్త పట్టాలు ఇవ్వలేదన్నారు. కలెక్టర్ స్పందించి వరద బాధితులకు స్థలాలు చూపడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు, పాలకులు స్పందించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వీరితో పాటు నాయకులు నాగరాజు, ఆశన్న, తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించండి



మేడికొండలో టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారులు

అయిజ: పశువులకు, జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి సూచించారు. మంగళవారం మండలంలోని మేడికొండలో పశువులకు టీకాలు వేశారు. అయిజ, మూగోనిపల్లి శివార్లలోని గొర్రెలకు వెటర్నరీ సిబ్బంది వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. పుశువులకు గురుక వ్యాధి, జబ్బువాపు వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఉచితంగా హెచ్ఎస్, బీక్యూ వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. గొర్రెలకు, మేకలకు చిటుక రోగం రాకుండా ఈటీ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. రైతులు అందరూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు.

పశువుల టీకాల పంపిణీ..

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని రేవులపల్లి, ఖమ్మంపాడు, గుడ్డెందొడ్డి, గ్రామాల్లో మండల పశువైద్యాధికారి డాక్టర్ శంకరయ్య ఆధ్వర్యంలో పశువులకు జబ్బువాపు, చిటుకు రోగం, గొంతు వాపు నివారణ టీకాలు వేశారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



తుమ్మిళ్ల-మాన్‌దొడ్డి మధ్యలోని రోడ్డుపై వేసి వదిలేసిన కంకర

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి మండలంలో అధ్వానంగా తయారైంది. మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు బీటీ రోడ్డు లేదు. కనీసం వాహనాలు నడిచేందుకు సరిపోయేంత రోడ్డు లేకపోవడంతో వాహనదారులు, మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు పనుల నిమిత్తం పలు గ్రామాల మీదుగా తిరిగే వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. రాజోళి నుంచి ముండ్లదిన్నెకు, పెద్ద తాండ్రపాడు నుంచి పచ్చర్లకు, మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుమ్మిళ్ల-మాన్‌దొడ్డి, చింతల్ క్యాంపు- ఆర్‌డీఎస్ కెనాల్ రోడ్డుకు మధ్యలో కంకర వేసి వదిలేయడంతో బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు అవుతున్నాయి. మట్టి రోడ్లు ఉన్నప్పటికీ పూర్తిగా గుంతలమయంగా మారాయి. కంకరవేసిన రోడ్లను త్వరగా బీటీ రోడ్లుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదమంచున ప్రభుత్వ పాఠశాలలు



ముండ్లదిన్నెలో రోడ్డు పక్కన ప్రహరీ లేని పాఠశాల

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రమాదమంచున కొనసాగుతున్నాయి. ప్రధాన రోడ్డు పక్కనే పాఠశాలలు ఉన్నప్పటికీ వాటికి ప్రహరీ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయనే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. సాధారణంగా గ్రామాల్లో నిర్మించిన పాఠశాలలు పొలాలకు సమీపంలో ఉంటాయి. ఆ పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పందులు, కుక్కలతో పాటు తరుచూ విషసర్పాలు వస్తుంటాయి. ఈ క్రమంలో కొంపౌండ్ వాల్ నిర్మిస్తే విద్యార్థులు సురక్షితంగా ఉండవచ్చని ఎన్నో సమావేశాల్లో విజ్ఞప్తులు చేసినప్పటికీ వాటి నిర్మాణాలు పెద్దగా చేపట్టిన దాఖలాలు లేవు. ప్రహరీలు నిర్మిస్తే ఆకతాయిల అడ్డుకట్టువేయవచ్చని, దీనిపై అధికారులు స్పందించకపోవడం దారుణమని ప్రజలు పేర్కొంటున్నారు. రాజోళితో పాటు, ముండ్లదిన్నె, నసనూరు తదితర గ్రామాల్లో పాఠశాలలు ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో విద్యార్థులు ఆట విడుపు సమయంలో రోడ్డెక్కుతారనే భయం ఇటు ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులకు ఉంటుంది. వాహనాలు నిత్యం ఆ రోడ్డు వెంట తిరుగుతుంటడంతో పిల్లలను బయటకు పంపాలంటే ఆందోళనకరంగా ఉంటుంది. ఇప్పటికైనా పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.